తొలి వెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి | గురువారం 17 సెప్టెంబర్ 2026

గ్రామకంఠం భూములకు గ్రహణం?

పులిగిల్లలో కబ్జాల పర్వం

పులిగిల్లలో విలువైన ప్రభుత్వ భూములపై వివాదం

“మేమే చదును చేశాం.. భూమి మాదే” అంటూ కొందరి వాదన

అక్రమంగా ఆక్రమిస్తే నోటీసులు జారీ చేస్తాం: గ్రామ కార్యదర్శి జోగు సైదులు

తొలివెలుగు, భువనగిరి: వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలో గ్రామకంఠం, ఖాళీ స్థలాలుగా ఉన్న భూములపై కొందరు ఆక్రమణలకు పాల్పడు తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో విలువైన స్థలాలు ఖాళీగా ఉండటంతో వాటిపై కొందరు వ్యక్తులు హక్కులు ప్రకటిస్తూ వివాదాలకు దారితీస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రామకం ఠం భూములకు సంబంధించి కొందరు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి స్థలాలను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్ని స్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని ఖాళీ స్థలాలను చదును చేసి వినియోగిం చుకునేందుకు ప్రయత్నా లు జరుగుతున్నాయని గ్రామస్థులు పేర్కొం టున్నారు. అయితే సదరు భూములపై తమకు హక్కులు ఉన్నాయని, తామే వాటిని చదును చేశామని కొందరు వ్యక్తులు చెబుతున్నట్లు సమా చారం.గ్రామంలోని ప్రభుత్వ, గ్రామకంఠం భూములను పరిరక్షించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. భూముల హద్దులు, యాజమాన్య హక్కులు, రికార్డుల ను అధికారులు పరిశీలించి వాస్తవాలను స్పష్టం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. కబ్జా చేస్తే నోటీసులు జారీ చేస్తాం.గ్రామ పంచాయతీ కార్యదర్శి జోగు సైదులును చరవాణి ద్వారా సంప్రదించగా.. గ్రామంలోని గ్రామకంఠం భూములను అక్రమంగా ఆక్రమించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులకు గ్రామ పంచాయతీ నుంచి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. భూమిపై హక్కుకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉంటే వాటిని గ్రామ పంచాయతీకి సమర్పించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. సంబంధిత వ్యక్తుల నుంచి వివరాలు, పత్రాలు అందిన అనంతరం ఉన్నతాధికారుల సూచనల మేరకు భూములను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని సైదులు తెలిపారు. భూముల హక్కులు, ఆక్రమణలపై తుది నిర్ధారణ అధికారుల పరిశీలన అనంతరం వెలువడాల్సి ఉంది.

నమిలలో పోషణ మాస వేడుకలు

పౌష్టికాహారంతోనే పిల్లల మెదడు వికాసం

అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన ర్యాలీ, తల్లుల సమావేశం

తొలివెలుగు, రాజాపేట: మండల పరిధిలోని నమిల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శోభారాణి, విజయలక్ష్మి ల అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా ముందుగా తల్లులు, పిల్లలతో కలిసి గ్రామంలో చైతన్య ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో గ్రామ ఉపసర్పంచ్ మార్క శివకుమార్ మాట్లాడుతూ.. పంట పొలాల్లో ప్రకృతి సిద్ధంగా లభించే ఆకుకూరలను క్రమం తప్పకుండా వండి పిల్లలకు అందించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణ మాట్లాడుతూ.. వర్షాకాలంలో లభించే పుంటికూర, మునగాకు, గునుగుకూర, తెల్లగర్జేరు, పిండికూర వంటి ఆకుకూరలతో పాటు పాలు, ఉడకబెట్టిన గుడ్డును రోజువారీ ఆహారంలో భాగం చేయాలన్నారు. ఆరోగ్య కార్యకర్త మాధవి మాట్లాడుతూ.. పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల వయస్సు వరకు పిల్లల మెదడు 80 శాతం వృద్ధి చెందుతుందని, సరైన పౌష్టికాహారం అందించకపోతే శారీరక, మానసిక ఎదుగుదల కుంటుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, తల్లులు, పిల్లలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

నేమిలలో ఘనంగా రక్తదాన శిబిరం

30 మంది రక్తదానం

రక్తదానం ప్రాణదాతలుగా నిలుస్తుంది: మేక వెంకటేశ్వర్‌రెడ్డి

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలం నేమిల గ్రామంలో విర్చెఆఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆత్మ డివిజన్ మాజీ చైర్మన్ మేక వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మేక వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులకు రక్తం ఎంతో అవసరమని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. “మానవసేవే మాధవసేవ” అనే భావనతో రక్తదాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసిన అనంతరం దాతలకు నిర్వాహకుల ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన రక్తదాతలు, ఫౌండేషన్ నిర్వాహకులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు జయవర్ధన్, ప్రసాద్, ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ పులి రాజు, ఉపసర్పంచ్ మార్క శివ, మాజీ సర్పంచ్ మేకల మమత–రమేష్, పాల చైర్మన్ డొంకెన సంపత్, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బడా గణేశ్‌కు మహా హారతీ

హైదరాబాద్: ఖైరతాబాద్ బడా గణేశ్‌ను చూసేం దుకు భక్తులు తరలివస్తున్నారు. ఉదయం నుంచే పంచ ముఖ సంకటహర మహాగణపతి దర్శనం కోసం వేలాది మంది భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. సాయం త్రానికి రద్దీ మరింత పెరిగింది. ఈ భారీ గణనాథుడికి బుధవారం రాత్రి నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వందలాది మహిళలు భక్తి శ్రద్ధలతో మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీప ప్రమిదలను చేతిలో ఉంచి బడా గణేశ్‌కి మహా హారతి ఇచ్చారు. వైభవంగా సాగిన మహా హారతి కార్యక్రమాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు.

TGTEL/26/A6221
తొలివెలుగు

సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

యోధుల త్యాగాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిగుళ్ల లింగం

రేణికుంట, కుర్రారంలో పోరాట యోధులకు నివాళులు

తొలివెలుగు, రాజాపేట : తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి వీరగాథలను భవిష్యత్ తరాలకు అందించేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిగుళ్ల లింగం డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా బుధవారం రాజాపేట మండలంలోని రేణికుంట, కుర్రారం గ్రామాల్లో యోధులకు నివాళులర్పించారు.

రేణికుంటలో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చింతలపూరి రామిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుర్రారంలో పాశం రామిరెడ్డి స్థూపం వద్ద పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా చిగుళ్ల లింగం మాట్లాడుతూ.. భూస్వామ్య, నిరంకుశ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన యోధుల త్యాగాల ఫలితంగానే ప్రజలకు భూమి, స్వేచ్ఛ, సామాజిక న్యాయం లభించాయని అన్నారు. వారి పోరాట చరిత్రను గ్రామాలు, మండల కేంద్రాల్లో సభల ద్వారా ప్రజలకు తెలియజేసి చైతన్యం కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభకు ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మూల పోచయ్య, ఎం. రామిరెడ్డి, పాశం రామిరెడ్డి మనవడు పాశం రామ్ ప్రతీప్‌రెడ్డి, నంద ఐలయ్య, ధన్య శ్రీశైలం, గన్నె నరసింహులు, రాగుల బీరయ్య, తరిగొప్పుల సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల మైలురాయిని చేరిన చౌటుప్పల్ కోర్టు

స్థానికంగానే ప్రజలకు సులభతరమైన న్యాయ సేవలు

సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారంలో కీలక పాత్ర

ఉచిత న్యాయ అవగాహన సదస్సులు, లోక్ అదాలత్‌లతో ప్రజలకు చేరువ

కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి

తొలివెలుగు, చౌటుప్పల్: చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు ఐదేళ్ల న్యాయ సేవా ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని ఆరో సంవత్సరం లోకి అడుగుపెట్టడం సంతోషంగా ఉందని కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి అన్నారు. బుధవారం చౌటుప్పల్ మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గతంలో చౌటుప్పల్ ప్రాంతానికి రామన్నపేటలోనే కోర్టు ఉండటంతో చిన్నచిన్న కేసుల పరిష్కారం కోసం కూడా ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి అక్కడికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఉదయం వెళ్లి సాయంత్రం వరకు అక్కడే ఉండి తిరిగి రావాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. జాతీయ రహదారి వెంట, పరిసర మండలాల ప్రజలకు అనువుగా ఉన్న చౌటుప్పల్‌లో కోర్టు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనల నేపథ్యంలో 2021 సెప్టెంబర్ 16న చౌటుప్పల్‌లో కోర్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోర్టు ఏర్పాటైన నాటి నుంచి చౌటుప్పల్, పరిసర ప్రాంతాల ప్రజలు సుదీర్ఘ దూరాలు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే న్యాయ సేవలు పొందుతున్నారని నరసింహారెడ్డి అన్నారు. ఐదేళ్ల కాలంలో పలు సివిల్, క్రిమినల్ కేసులను చట్టపరంగా, నిష్పక్షపాతంగా విచారించి పరిష్కరించడంలో కోర్టు కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రజలు, మహిళలు, యువతకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు పలు ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. రాజీ చేసుకునే అవకాశం ఉన్న వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక లోక్ అదాలత్‌లను నిర్వహించడం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. చౌటుప్పల్ కోర్టు ఐదేళ్ల ప్రస్థానంలో సహకరించిన న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, పోలీసు శాఖ, స్థానిక ప్రజలకు వాకిటి నరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజలకు మరింత వేగంగా న్యాయ సేవలు అందించేందుకు కృషి కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రైవేటు, భూదాన్ భూములు బయటకు తీయాలి

కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్: కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 1945 నుంచే కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ధరణిలో జరిగిన తప్పిదాలతో ప్రజలకు చాలా నష్టం జరిగిందన్నారు. 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూముల వివరాలను బయటకు తీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో కూనంనేని మాట్లాడారు. హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలను వెల్లడించాలన్నారు. భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించే అంశాన్ని ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించారు. నిజాం హయాంలో సర్ఫ్‌ఖాన్ పేరిట హైదరాబాద్‌లో ఉన్న భూములు ఇప్పుడు ఎక్కడని ప్రశ్నించారు. వాటిని బయటకు తీస్తే స్థలం లేని అందరికీ ఇవ్వొచ్చన్నారు. 22ఏ విషయంలో జరిగింది సాంకేతిక తప్పిదంగా భావిస్తున్నట్లు తెలిపారు. దీనిలో మంత్రులు, అధికారుల పాత్ర ఎంత ఉందో తేల్చాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి అర్చనలు

సాయి మందిరంలో చర ప్రతిష్ఠ గణనాథునికి ప్రత్యేక పూజలు

హాజరైన బెజుగం శ్రీనివాసులు – సరిత దంపతులు

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, గణపతి అర్చనలు వైభవంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్, ట్రస్టు అభివృద్ధి సేవా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు కొనసాగాయి.ఆలయ ప్రధాన అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ చర ప్రతిష్ఠ వినాయకుడికి శాస్త్రోక్తంగా అర్చనలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ పూజా కార్యక్రమంలో బెజుగం శ్రీనివాసులు – సరిత దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళహారతులతో స్వామివారిని కొలవగా, ఆర్యవైశ్యులు, భక్తులు ఆధ్యాత్మిక భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడం పట్ల స్థానిక పోలీసులు ప్రత్యేకంగా అభినందించి, నిర్వహణా తీరును ప్రశంసించారు.

పట్టుదలే ఆయుధం..

ఎంబీబీఎస్ సీటు సాధించిన మిశ్రుత

ఖమ్మం వైద్య కళాశాలలో సీటు పొందిన గిరిజన విద్యార్థిని

హర్షం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు, ఉగ్గంపల్లి గ్రామస్థులు

తొలివెలుగు, చిన్నగూడూర్ : పట్టుదలతో కష్టపడి చదివితే ఏ రంగాన్నైనా జయించవచ్చని నిరూపించింది చిన్నగూడూర్ మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని మిశ్రుత. ధూమ్డా తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆంగోత్ రమేష్ – సునీత దంపతుల కుమార్తె మిశ్రుత ఖమ్మంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. చిన్నతనం నుంచే చదువుపై ప్రత్యేక ఆసక్తి కనబరిచిన మిశ్రుత, తన లక్ష్యాన్ని సాధించి తల్లిదండ్రులతో పాటు గ్రామానికి గర్వకారణంగా నిలిచిందని గ్రామస్థులు కొనియాడారు. భవిష్యత్తులో వైద్యురాలిగా ఉన్నత స్థాయికి ఎదిగి పేదలు, గిరిజన ప్రజలకు సేవలు అందించాలని పలువురు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మిశ్రుతను ఆదర్శంగా తీసుకుని గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.

సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదే

నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించిన ఘనత

పోరాటాన్ని మతపరమైన అంశంగా చిత్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్‌రెడ్డి

తొలివెలుగు, చౌటుప్పల్: తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నవాబు, రజాకార్లకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా చౌటుప్పల్ మండలం మసీదుగూడెం గ్రామంలో బుధవారం సాయుధ పోరాట యోధుడు, సీనియర్ నాయకుడు వాకిటి సాయిరెడ్డి స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లె శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సాయుధ పోరాట యోధుల త్యాగాల ఫలితంగానే 'దున్నేవాడికే భూమి' అనే నినాదానికి కార్యరూపం లభించడంతో పాటు వెట్టిచాకిరీ నుంచి ప్రజలకు విముక్తి లభించిందన్నారు. రాచరిక, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటాన్ని ప్రస్తుతం మతపరమైన అంశంగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. చారిత్రక వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నాలను మేధావులు, ప్రజాస్వామ్యవాదులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చరిత్రను చెరిపివేయాలనుకున్నా అది చెరిగిపోదని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్య క్రమంలో సీపీఐ నాయకుడు ఉడుత రామలింగం, ఏఐవైఎఫ్ నాయకులు కొండూరు వెంకటేష్, బద్దుల సుధాకర్, రోషణాగారి అంజయ్య, కుంటి పాపయ్య, దాసరి కృష్ణ, ఉబ్బు సుదర్శన్ పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

వ్యసనాలతో యువత భవిష్యత్తు నాశనం

ఆన్‌లైన్ బెట్టింగ్, సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

అంకిరెడ్డిగూడెంలో పోలీసు అవగాహన సదస్సులో సీఐ మన్మధకుమార్

తొలివెలుగు, చౌటుప్పల్ : గుట్కా, గంజాయి, మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని, గ్రామాలను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని చౌటుప్పల్ సీఐ జి. మన్మధకుమార్ అన్నారు. చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రచ్చబండ ఆవరణలో సర్పంచ్ సుర్వి మల్లేష్‌గౌడ్ అధ్యక్షతన పోలీసు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మన్మధకుమార్ మాట్లాడుతూ.. చిన్న గ్రామమైన అంకిరెడ్డిగూడెంలో ప్రజలు, యువతను చైతన్యపరిచేందుకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత గుట్కా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో పాటు జూదం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడితే భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాలకు పాల్పడి కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్టు వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. సర్పంచ్ సుర్వి మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ.. పోలీసుల సూచనలు పాటిస్తూ అంకిరెడ్డిగూడెంను సురక్షిత, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం సీఐ మన్మధకుమార్, ఎస్ఐ నర్సిరెడ్డిని సర్పంచ్ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వలందాస్ మహేష్‌గౌడ్, బత్తుల అనుష మహేష్‌గౌడ్, పాలం వెంకటేశంగౌడ్, ముద్దం లింగస్వామిగౌడ్, దొడ్ల అండాలు శెట్టయ్యగౌడ్, దండుగల వెంకటేశం, బొమ్మని శ్రావణి స్వామిగౌడ్, రాపోలు రేణుక మల్లేష్, మహిళా సంఘం అధ్యక్షురాలు పెండం లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండుగౌడ్, పోలీసు సిబ్బంది, యాంటీ డ్రగ్స్ కమిటీ సభ్యులు పర్ని శ్రీధర్‌రెడ్డి, భీమగోని మల్లేశంగౌడ్, పర్మి శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల జంగయ్యగౌడ్, బొమ్మని స్వామిగౌడ్, సుర్వి విజయ్‌గౌడ్, యాట శంకరయ్య, గ్రామస్థులు, యువకులు, మహిళలు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పడిన ప్రతి నీటి చుక్కనూ ఒడిసిపడదాం

ఫామ్ కుంటలతో రైతన్నకు సాగునీటి భరోసా

భూగర్భ జలాల పెంపునకు జలసిరి కార్యక్రమం

ఎస్. లింగోటంలో ఫామ్ కుంటకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ

తొలివెలుగు, చౌటుప్పల్: వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకింపజేయడం ద్వారా పంటలకు సాగునీటి భరోసా కల్పించవచ్చని ఎస్. లింగోటం గ్రామ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమిడి ప్రదీప్ జీ అన్నారు. 'జలసిరి' కార్యక్రమంలో భాగంగా ఎస్. లింగోటం గ్రామంలోని శివుని బావి శేల్కలో ఫామ్ కుంట నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ జీ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం సకాలంలో లేక రైతులు సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వర్షం ద్వారా లభించే ప్రతి నీటి చుక్కను వృథా కాకుండా సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ''వర్షం పడటం మన చేతుల్లో లేదు.. కానీ పడిన నీటిని దాచుకోవడం మన చేతుల్లోనే ఉంది'' అని అన్నారు. పొలాల్లో ఫామ్ కుంటలను ఏర్పాటు చేయడం వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూమిలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాలను పెంచుకోవచ్చన్నారు. తద్వారా బావులు, బోర్లలో నీటి లభ్యత పెరిగి వర్షాధార పంటలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు గ్రామస్థాయిలో మరిన్ని చర్యలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాతరాజు ధనంజయ్య, కార్యదర్శి మచ్చగిరి, వార్డు సభ్యులు ఉప్పు వీరేశం, సదానందం, శోభ, శంకరయ్య, లింగస్వామి, సుశీల, సుజాత, సత్తయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కళమ్మతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు

డివిజనల్ పంచాయతీ అధికారి

నాగిరెడ్డిపేట : గ్రామపంచాయతీ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్పీఓ) సురేందర్ అన్నారు.బుధవారం మండల కేంద్రంలోని గోపాల్ పెట్ గ్రామపంచాయతీ పరిధిలో గల ఖాళీ స్థలాలను సందర్శించి పరిశీలించారు.498 సర్వే నెంబర్ ను పరిశీలించి వాటి వివరాలను పంచాయతీ కార్యదర్శికి అడిగి తెలుసుకున్నారు.ఈ సర్వే నెంబర్ లో సుమారు 1.20 గుంటల భూమి ఉందని,అందులో 5షెట్లర్లతో పాటు మిగతాది ఖాళీ స్థలంగా ఉందని,అట్టి స్థలం గ్రామపంచాయతీది అని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.ముందుగా పంచాయతీ స్థలాలను కొలతలు వేసి, చుట్టూ సరిహద్దులను గుర్తించి అనంతరం వినియోగానికి అనుకూలంగా ఉన్న స్థలాలను నిబంధనల ప్రకారం బహిరంగ వేలం ద్వారా అద్దెకు ఇచ్చి పంచాయతీకి ఆదాయం సమకూర్చి, గ్రామాభివృద్ధికి వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. డీఎల్పీవో వెంట గ్రామ సర్పంచ్ వంశీకృష్ణ గౌడ్,ఉప సర్పంచ్ గులాం హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి సలీం ఉన్నారు.

ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనాలు నిషేధం

హైదరాబాద్: హైదరాబాద్ నగర పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలకు సంబంధించి అధికారులు కీలక ప్రకటన చేశారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కఠిన ఆదేశాల నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి అనుమతి లేదని హైదరాబాద్ సిటీ పోలీస్, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

హైకోర్టు ఆదేశాల మేరకు..

హుస్సేన్‌సాగర్‌ను కాలుష్యం బారి నుంచి రక్షించడానికి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి విగ్రహాల నిమజ్జనానికి తావులేదని అధికారులు తేల్చిచెప్పారు. ఉత్సవ కమిటీలు, పూజా సంఘాలు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

ఈ ఏడాది ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలను నిషేధించినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా పలుచోట్ల ప్రత్యేక బేబీ పాండ్స్, క్రేన్లు, కృత్రిమ నిమజ్జన కొలనులను ఏర్పాటు చేశారు. ఒకవేళ నిబంధనలను ఉల్లంఘించి ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి ప్రయత్నించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిటీ పోలీసులు హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రభుత్వ సూచనల మేరకు పండగను జరుపుకోవాలని కోరారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం

నిజాంసాగర్: మండలంలోని మాగి గ్రామ సమీపంలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో కొలువుదీరిన గణనాథునికి ఫ్యాక్టరీ యాజమాన్యం, అధికారులు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఫ్యాక్టరీ యాజమాన్యం, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. గణనాథుని ఆశీస్సులతో ఫ్యాక్టరీ మరింత అభివృద్ధి చెందడంతో పాటు కార్మికులు, సిబ్బంది, పరిసర ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

అనంతరం ఫ్యాక్టరీ ఆవరణ నుంచి గణనాథుని శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రలో ఫ్యాక్టరీ యాజమాన్యం, కార్మికులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పుల మోత, భక్తిగీతాల మధ్య కొనసాగిన శోభాయాత్రతో ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. కర్మాగారం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర సిబ్బంది క్వార్టర్స్ మీదుగా కొనసాగి మంజీరా పరివాహక ప్రాంతానికి చేరుకుంది. అక్కడ గణనాథునికి మరోసారి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తిశ్రద్ధల మధ్య విగ్రహాన్ని మంజీరా నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ షాదుల్లా, కేన్ మేనేజర్ వెంగల్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, పీవో గోవింద్, మాగి సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్, వడ్డేపల్లి సర్పంచ్ బొజ్జ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో సంఘం ఎన్నికల కోసం ఎదురుచూపులు

హైదరాబాద్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ ఇంకా కొలిక్కి రావడం లేదు. ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నాలుగు నెలలు గడిచినా.. అధికారులు షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు పూర్తయిన తర్వాతే విలీన ప్రక్రియ చేపడతామని ప్రభుత్వం గతంలోనే స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణ బాధ్యతలను కార్మిక శాఖకు అప్పగించింది. ఆర్టీసీ యాజమాన్యం సెప్టెంబర్ 7, 15 తేదీల్లో రిటర్నింగ్ అధికారి (జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్) ఎదుట హాజరై వివరాలు సమర్పించింది. ఎన్నికల షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపిన అధికారులు.. నేటికీ తేదీలను ఖరారు చేయకుండా కాలయాపన చేస్తున్నారంటూ కార్మికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు ఈ ఏడాది ఏప్రిల్ 22–24 వరకు సమ్మె చేశారు. 24న ప్రభుత్వంతో జరిగిన చర్చల ఫలితంగా సమ్మె విరమించారు. గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నిక తర్వాతే విలీన ప్రక్రియ చేపడతామని ప్రకటించిన సర్కారు... జూన్ 10న ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ రిటర్నింగ్ అధికారిగా కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ సునీతా గోపాల్ దాస్ ను నియమించింది. కానీ ఇప్పటికీ ఎన్నికల నోటిఫికేషన్ రాకపోవడంతో కార్మికుల్లో తీవ్ర ఆందోళన కనిపిస్తుంది. జాప్యానికి నిరసనగా ఈ నెల 22న హైదరాబాద్ లోని బస్ భవన్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని లేబర్ కమిషనర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ, అనంతరం మహా ధర్నా చేపట్టాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) నిర్ణయించింది. అక్టోబర్ మొదటి వారంలోపు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి, వెంటనే విలీన ప్రక్రియను పూర్తి చేయాలని యూనియన్ డిమాండ్ చేస్తోంది.

అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం లేదని అనుమానం కలుగుతున్నది. అక్టోబర్ మొదటి వారంలోపు ఎన్నికలు నిర్వహించి, వెంటనే విలీనం చేయాలి. ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధన కోసం 22న తలపెట్టిన 'చలో లేబర్ ఆఫీస్' మహా ధర్నాలో యూనియన్లకు అతీతంగా ఉద్యోగులు, కార్మికులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఈదురు వెంకన్న, ఈయూ ప్రధాన కార్యదర్శి తెలిపారు.

వైభవంగా గణేష్ నవరాత్రి వేడుకలు

లక్ష్మీ నరసింహ కాలనీ, నాగోల్ విలేజ్‌లో వినాయకుడికి ప్రత్యేక పూజలు

అన్నప్రసాద వితరణలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ అరుణ సురేందర్‌యాదవ్

తొలివెలుగు, నాగోల్: నాగోల్ డివిజన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీ నరసింహ కాలనీ, నాగోల్ విలేజ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను డివిజన్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అరుణ సురేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, ఐక్యతతో నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న కాలనీల ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పరిశుభ్రత తదితర కనీస వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వివాదాల అడ్డాగా బీసీ గురుకులం!

కరీంనగర్: పేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన గురుకుల పాఠశాల వివాదాలకు కేంద్రంగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. హుజూరాబాద్ పట్టణ పరిధిలోని వరంగల్–కరీంనగర్ జాతీయ రహదారి పక్కన బోర్నపల్లి శివారులో అద్దె భవనంలో కొనసాగుతున్న వీణవంక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో గత పది నెలలుగా వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. క్రమశిక్షణ, విద్య, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన క్యాంపస్‌లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 435 మంది విద్యార్థులు, 25 మంది సిబ్బంది ఉన్న ఈ క్యాంపస్‌లో పర్యవేక్షణ లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు ఆరు నెలల క్రితం సీసీ కెమెరాలు కనిపించకుండా పోయాయనే అనుమానంతో ఇద్దరు విద్యార్థులను బాధ్యులను చేస్తూ ప్రిన్సిపాల్ పోలీసులను ఆశ్రయించిన ఘటన వివాదాస్పదంగా మారింది. సిబ్బంది, పోలీసులు విద్యార్థులను వేధించారని, చేయి చేసుకున్నారని ఆరోపిస్తూ తల్లిదండ్రులు ఆందోళనకు దిగినట్లు సమాచారం. ఈ ఘటన అప్పట్లో స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.

హాస్టల్ గదిలోనే మద్యం సేవించిన బాలుడు

మరో ఘటనలో ఓ విద్యార్థి హాస్టల్ గదిలోకి మద్యం సీసా తీసుకువచ్చి సేవించినట్లు ఆరోపణలు వచ్చాయి. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురైన బాలుడిని తొలుత హుజూరాబాద్ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనతో గురుకులంలో విద్యార్థుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తాయి. సిబ్బంది వేధింపులు తట్టుకోలేక విద్యార్థులు హాస్టల్ నుంచి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇద్దరు విద్యార్థులు హాస్టల్ నుంచి వెళ్లిపోగా, వారిలో ఒకరి ఆచూకీ రెండు రోజుల పాటు లభించకపోవడంతో తోటి విద్యార్థులు ఆందోళనకు దిగినట్లు సమాచారం. తాజాగా రెండు రోజుల క్రితం గనుముక్కుల గ్రామానికి చెందిన ఓ బాలుడు హాస్టల్ నుంచి బయటకు వెళ్లి నడుచుకుంటూ, వాహనదారులను లిఫ్ట్ అడుగుతూ స్వగ్రామానికి చేరుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే పలుమార్లు పాఠశాలలోని సమస్యలపై విద్యార్థులు కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపైకి వచ్చి ధర్నాలు నిర్వహించిన ఘటనలు చోటుచేసుకున్నాయి.

నాసిరకం భోజనం.. తాగునీటి సమస్యలు

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాల్సిన గురుకులంలో మక్కిన బియ్యంతో నాసిరకం భోజనం పెడుతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గతంలో తాగేందుకు స్వచ్ఛమైన నీరు అందడం లేదంటూ విద్యార్థులు ఆందోళనకు దిగినట్లు సమాచారం. మరోవైపు విద్యా సంవత్సరం చివరి దశకు చేరుకున్నప్పటికీ పదో తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ సిలబస్ పూర్తికాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీణవంక బీసీ గురుకుల పాఠశాలలో మొత్తం 480 సీట్లు ఉండగా, ప్రస్తుతం 435 మంది విద్యార్థులు ఉన్నారు. 45 సీట్లు ఖాళీగా ఉన్నప్పటికీ పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై వస్తున్న ప్రచారం కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు వెనుకడుగు వేస్తున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది. నిబంధనల ప్రకారం ప్రిన్సిపాల్ పాఠశాలకు రెండు కిలోమీటర్ల పరిధిలో నివాసం ఉంటూ క్యాంపస్‌ను పర్యవేక్షించాల్సి ఉంటుందని విద్యార్థి సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.